ఆసుపత్రిని ప్రారంభించిన ఆరోగ్య శాఖ మంత్రి



గోల్కొండ: నిరుపేదలకు సైతం వైద్యం అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రుల వారు ముందుకురావాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మెహిదీపట్నంలో మ్యాట్రిక్స్ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, డాక్టర్ కె.ఎ స్.చక్రవర్తి, డాక్టర్ ప్రవీణ్‌రాఘవ, డాక్టర్ బి.ఎ స్.రావు, డాక్టర్ హేమంత్, అబ్దుల్ రహీం, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించడం హర్షణీయం



సంపత్ కుమార్‌ను కలిసిన మహేష్‌బాబు

జియాగూడ: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించడం హర్షణీయమని జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సహా కార్యదర్శి, హైదరాబాద్ టీం సంపత్ అన్న సైన్యం మహేష్ బాబు అన్నారు. ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి డాక్టర్ ఎస్‌ఏ.సంపత్ కుమార్‌ను కలిసి సన్మానించారు. అనంతరం మహేష్‌బాబు మాట్లాడుతూ..40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు అన్ని కులాల వారికి ప్రాధాన్యం కల్పించడంతో తమ దీర్ఘకాల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

మెన్స్‌వేర్ షోరూమ్‌ను ప్రారంభించిన స్పీకర్



గోల్కొండ: టోలిచౌకీలో కరిష్మా గ్రూప్ వారి లెజెండ్ మెన్స్‌వేర్ షోరూమ్ ప్రారంభమైంది. రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తాచాటుతున్న కార్తీక్



గోల్కొండ: షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వై.సి.ఎస్.కార్తీక్ క్రికెట్‌లో సత్తాచాటుతున్నారు. ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్‌లో కూడా సత్తాచాటుతూ స్కూల్ టోర్నమెంట్‌లు అండర్–14 జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. ఫారూక్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న కార్తీక్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని కోచ్ ఫారూఖ్ ఫరాక్ అంటున్నారు. ప్రతినిత్యం ప్రాక్టిస్ చేస్తు కఠోర సాధనతో ముందుకు సాగుతున్న కార్తీక్ పాల్గొన్న ప్రతి టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచి పలుమార్లు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్ అవార్డులు కూడా పొందారు. పాఠశాల వారు సైతం కార్తీక్‌ను ప్రోత్సహిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో పాము కలకలం



పామును పట్టుకున్న వెంకటేష్‌నాయక్

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం పాము కలకలం రేపింది.స్టేషన్ ముందు పాము ఉన్నట్లు గమనించిన సిబ్బంది మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ నాయక్ పాములు పట్టుకుంటాడని తెలిసి ఆయనను పిలిపించారు. అక్కడికి చేరుకున్న వెంకటేష్ నాయక్ నాలుగు ఫీట్ల పొడవున్న పాము (జెర్రిపోతు) పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు అప్పగించాడు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

సీహెచ్.విద్యాసాగర్‌రావు



రామాచారికి అవార్డును ప్రదానం చేస్తున్న విద్యాసాగర్‌రావు, కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న తెలుగు భాషను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని పూర్వ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం రవీంద్ర భారతిలో వంశీ ఆర్ట్ థియేటర్స్, వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి 73వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకుడు కె.రామాచారికి వంశీ-కేవీ రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డును ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రపంచ గుర్తింపు పొందిన యునెస్కో సంస్థ ఈ నెల 21వ తేదీన తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మంత్రులు జైలుకు వెళ్తే వారితో పాటు ఐఏఎస్ అధికారులు కూడా జైలుకు వెళ్తుండడం ఎంతో బాధాకరమన్నారు. ఐఏఎస్ అధికారులు పరిపాలన దక్షకులుగా ఉండాలని సూచించారు. పరిపాలన దక్షతతో పాటు అనేక రంగాల్లో సమర్థవంతంగా పనిచేసిన కేవీ రమణాచారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కేవీ రమణాచారికి సర్దార్ అనే బిరుదును ప్రదానం చేయాలని కళాసంస్థలకు విజ్ఞప్తి చేశారు. సంగీతం అంటే కేవలం పాడటం, నృత్యం మాత్రమే కాదని సంగీతం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అంతకు ముందు కె.రామాచారి శిష్య బృందంచే సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ రమణాచారి, కిమ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ బి.కృష్ణయ్య, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్.గోపీ, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి



పద్మశాలి మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంబటి శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: పద్మశాలి మహాసభలను విజయవంతం చేసేందుకు పద్మశాలి సోదరులంతా కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. మార్చి 9న జరిగే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభల ఆహ్వాన పత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్వాన్ మార్కండేయ భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ..మార్చి 9న కార్వాన్ నుంచి తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. పద్మశాలి సోదరుల హక్కుల సాధన, హక్కుల పరిరక్షణ కోసం మనమంతా కలిసికట్టుగా వేదికపై ప్రభుత్వ దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కార్వాన్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి రఘునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట సాయికుమార్, ననీస్‌కుమార్, డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కట్ల అశోక్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉత్తరపల్లి కృష్ణ, సి.గోపాల్, పల్లె పాండు, అంబటి సంతోష్, శ్రీనివాస్ రాపోలు సందీప్‌చౌదరి, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చెస్ పోటీలలో విజేతలతో నిర్వాహకులు

చార్మినార్: డాక్టర్ మన్‌మోహన్ సింగ్ మెమోరియల్ స్కూల్ చెస్ టోర్న మెంట్–2025 పోటీల్లో గోల్కొండలోని కేంద్రీయ విద్యాలయ స్కూల్ విద్యార్థి మంగోలపల్లి విద్యాధర్ మొదటి బహుమతి పొందారు. రెండో బహుమతి నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి మహ్మద్ షబ్బీర్ అహ్మద్‌కు లభించగా..మూడో బహుమతి మహేంద్రహిల్స్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి విజయేందర్‌కు లభించింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఈ పోటీలు తొమ్మిది రౌండ్లలో స్విస్ ఫార్మేట్‌లో జరిగాయి. విజేతలకు సుల్తాన్-ఉల్-ఉలూం ప్రిన్సిపాల్‌తో పాటు సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హైఖాద్రీ, డైరెక్టర్ సిరాజుద్దీన్ తదితరులు బహుమతులు అందజేశారు. అండర్–16 పేరుతో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు మెమెంటోలతో పాటు సర్టిఫికెట్‌లను అందజేశారు.



అలరించిన కవి సమ్మేళనం

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో ఉర్దూ, హిందీ కవి సమ్మేళనం అలరించింది. పలువురు కవులు తమ కవితలతో అందరిని ఆకట్టుకున్నారు. హిందీ, ఉర్దూ భాషల్లో కవి సమ్మేళనం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముఖైర్ అహ్మద్, అశ్వక్ హైదర్, ప్రభాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్పు, నేర్పుగా సాధన చేస్తే విజయం తథ్యం



అన్నమాచార్య విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న శోభారాజు

బండ్లగూడ: ఓర్పు, నేర్పుగా సాధన చేస్తే విజయం వరిస్తుందని పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని కుందన మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లపాక అన్నమాచార్య పంచలోగ విగ్రహ ప్రతిష్ఠాపనలో శోభారాజు పాల్గొని అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంగీతం నేర్చుకోవడంతో భక్తిభావం పెరుగుతుందన్నారు. కుందన మ్యూజిక్ అకాడమీ దినదిన ప్రవర్థమానం కావాలని, పిల్లలకు మరెన్నో కీర్తనలు నేర్పించి మంచి కళాకారులుగా తీర్చిదిద్దాలన్నారు. కుందన మ్యూజిక్ అకాడమీ అధినేత సాలూరి సతీష్ పద్మశ్రీ డాక్టర్ శోభారాజు అనుమతితో పలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంకటేష్, ఏసీపీ సత్యనారాయణ, సీఐ సురేష్ పలువురు సంగీత ప్రియులు, సంగీత కళాకారులు పాల్గొన్నారు.

స్మార్ట్ బిన్లను సద్వినియోగం చేసుకోవాలి



స్మార్ట్ బిన్లు ప్రారంభిస్తున్న శ్రీనివాస్

చాదర్‌ఘాట్: గార్బేజ్ స్మార్ట్ బిన్‌లను కాలనీవాసులు సద్వినియోగం చేసుకుని చెత్తరహిత డివిజన్‌గా ఏర్పాటు చేసుకోవాలని సర్కిల్–6 ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్ అన్నారు. ఆదివారం అజంపురా డివిజన్ కాలడేరా, జటోఫట్ నగర్ ప్రాంతాల్లో గార్బేజ్ స్మార్ట్ బిన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో చెత్త పాయింట్లను గుర్తించి 8 స్మార్ట్ బిన్‌లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు అబ్రహార్ మాట్లాడుతూ.. గార్బేజ్ బిన్లను కాలనీవాసులు వినియోగించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కిషన్‌బాగ్ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు..అల్లా మజీద్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు..అసద్ బాబానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

రిజర్వేషన్లలో సామాజిక న్యాయం పాటించాలి

నాంపల్లి: రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అగ్రకులాలకు అన్యాయం జరగకుండా రిజర్వేషన్లలో సామాజిక న్యాయం పాటించాలని బీఆర్‌ఎస్ నేత సయ్యద్ ముస్తాక్ అలీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మల్లేపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా నాంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు మహిళలకే రిజర్వేషన్లు కల్పిస్తూ వస్తున్నారని విమర్శించారు. ఎస్సీ మహిళ, బీసీ జనరల్, బీసీ మహిళలకు కేటాయిస్తూ వస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లను బీసీలకు, ఎస్సీలకే కేటాయిస్తూ పోతే మిగతా కులాలకు అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. వచ్చే ఏడాది కౌన్సిలర్ ఎన్నికలు జరిగితే మెజార్టీ స్థానాల్లో నాంపల్లి నియోజకవర్గంలో జనరల్ కేటగిరికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

అంధకారంలో కోకర్ వాడి

చార్మినార్: ఘాన్సీ బజార్ డివిజన్‌లోని కోకర్ వాడిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం సంబంధిత జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో అంతటా అంధకారం నెలకొన్నదన్నారు. విద్యుత్ బల్బులు కాలిపోయాయా..? లేదా..? టైమర్ పని చేస్తుందా... లేదా అనే విషయాలను సంబంధిత అధికారులు తెలుసుకొని వెంటనే వీధి దీపాలు ప్రతిరోజూ నిరంతరాయంగా వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీనియర్ సిటిజన్స్‌కు కంటి, ఈఎన్‌టీ పరీక్షలు

గోల్కొండ: 60 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా కంటి, ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహిస్తున్నామని టోలిచౌకీలోని ఈస్పైర్ ఐఅండ్‌ఈఎన్‌టీ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎం.భాషా తెలిపారు. కంటి పరీక్షలు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు..ఈఎన్‌టీ పరీక్షలు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. టోలిచౌకీ గెలాక్సీ సెంటర్ బర్గర్ కింగ్ రెస్టారెంట్ ఎగువన ఉన్న ఆసుపత్రిలో ఈ ఉచిత వైద్య పరీక్షలు ఉంటాయని ఆయన తెలిపారు. పరీక్షల కోసం సీనియర్ సిటిజన్స్ 90001 41617, 040-451 23999లో సంప్రదించాలన్నారు.

కారుతో డ్రైవర్ పరార్

బంజారాహిల్స్: అద్దెకు కార్లు ఇచ్చే వ్యాపారి వద్ద నమ్మకంగా పనిచేస్తూ కళ్లుగప్పి కారుతో ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్–3లో నివసించే అనీష్ ఊబర్ క్యాబ్‌లు నిర్వహిస్తుంటాడు. ఆయన వద్ద కొంతకాలంగా నాగారపు వెంకటేశ్ డ్రైవర్‌గా చేరి అద్దె కార్లు తిప్పుతుండేవాడు. ఈనెల 2న తాను ఉద్యోగం మానేస్తున్నానని చెప్పి కారుతో సహా ఉడాయించాడు. కారు జీపీఎస్ ట్రాక్‌ను పరిశీలించగా ఏపీలోని ఏలూరు జిల్లా ఒంగుటూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తించారు. కారుతో సహా ఉడాయించడమే కాకుండా పేమెంట్ కూడా చెల్లించలేదని, చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివ మహా జాగరణ మహోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సదానందం గుప్తా తదితరులు

జియాగూడ: శివ మహా జాగరణ మహోత్సవం 13వ వార్షికోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా అన్నారు. ఆదివారం రహీంపురా సత్తెన్న గల్లీలోని శంకర్‌జీ హనుమాన్‌జీ ఆలయంలో మహా జాగరణ మహోత్సవ బ్రోచర్‌ను సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సదానందం గుప్తా మాట్లాడుతూ..మహా శివరాత్రిని పురస్కరించుకొని రాత్రి 8 గంటలకు ఆలయ కల్యాణ మండపంలో మా వైష్ణవి దేవి జాగరణ మండల్ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు ఎస్.రాజన్‌కుమార్, హరిఓం మిశ్రా, నిహారిక(నిజామాబాద్), మోహిత్ రాస్ (వాందావన్), ఉత్తరప్రదేశ్ వారిచే వివిధ దేవతల వేషధారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.రాజన్‌కుమార్, కోశాధికారి డి.రాజేందర్ సింగ్, సహా కోశాధికారి టి.సచిన్ రాజ్ సింగ్, సలహాదారులు ప్యాట రాజ్ కుమార్, బానూరి నర్సింహులుగుప్తా, యాద శ్రీనివాస్‌గుప్తా, గోపాల్ సింగ్, సురేందర్ సింగ్, విశ్వనాథ్ ఆనంద్‌కుమార్, తోట శ్రవణ్‌కుమార్, జంగం పాండు, పి.లక్ష్మీనారాయణ, చుక్కా నవీన్, ఆకారపు శ్రీనివాస్‌గుప్తా, పి.సందీప్‌గుప్తా, కె.నరేష్ గుప్తా, ఎ.రవికుమార్, టి.కులదీప్ సింగ్, జె.హరినాథ్, ఎన్.సురేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఓపెన్ టెండర్ విధానాన్ని అమలు చేయాలి



మంత్రికి మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో ఓపెన్ టెండర్ విధానాన్ని అమలు చేయాలని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానం అమలు చేయడం ద్వారా వేలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలై అప్పులపాలయ్యారని ఆయన ఆరోపించారు. ఆదివారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఇతర పలు శాఖలలో ఓపెన్ టెండర్ విధానం అమలులో ఉందన్నారు. కేవలం కొంతమంది అధికారుల కక్కుర్తి కోసం గత బీఆర్‌ఎస్ సమయంలో వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానం అమలు చేశారని ఆయన ఆరోపించారు. ఏఎంఎస్ విధానం ద్వారా లక్షలాది రూపాయాల అవినీతి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. తాను వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు.

21న స్ఫటిక శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం

నాంపల్లి: ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ఈ నెల 21న స్ఫటిక శివలింగ, నందికేశ్వర, ఉష్ట్ర (ఒంటె) వాహన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం జరుగుతుందని ఆలయ ఎక్స్–అఫీషియో ధర్మకర్త కాసుల శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆలయ ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహవాచనము, దీక్షా, కంకణధారణం, అఖండ దీపారాధన, మాతృకా, యోగినీ, వాస్తు మండల, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతోభద్రమండల స్థాపనం, ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, దేవతా కలశ స్థాపనం, స్థాపిత దేవతావాహనములు, జలాధివాసం, ప్రదోష పూజ, ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. అలాగే 22న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆవాహిత మంటప పూజ, ద్వాత్రింశత్(32) కలశస్నపనం, అభిషేకం, జలాధివాసాంగ హవనములు, ఛండీ హవనం, హారతి ఉంటుందని వివరించారు. అదేరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ధాన్యాధివాసం, అన్నాధివాసం, పుష్పాధివాసం, ఫలాధివాసం, తత్వన్యాసములు, శయ్యాధివాసం, ప్రదోషపూజ, హారతి, ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. 23న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అవాహిత మంటప పూజ, ధాన్యాధివాసాంగహవనములు, గర్తసంస్కారం, నవరత్న న్యాసము ఉంటుందని తెలిపారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: పర్యాటక ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి. గోల్కొండ కోటలో వేలాదిగా పర్యాటకులు సందడి చేశారు. కోటలోని ఆయుధాగారంలోని కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఆయుధాలను చూస్తూ వాటిని తమ సెల్‌ఫోన్స్‌లో బంధించుకున్నారు. మరో వైపు కుతుబ్‌షాహీ రాజుల సమాధుల ప్రాంగణమైన సెవన్ టూంబ్స్‌లో సైతం పర్యాటకులు సందడి చేశారు. ఈ ప్రాంతంలోని ఆధునీకరించబడిన కుతుబ్‌షాహీ రాజుల సమాధుల అందాలను తిలకించారు. రాజుల శవాలను స్నానం చేయించే గదులను సైతం ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్సై నాగరాజు

పంజగుట్ట: సమైక్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ సహకారంతో తుమ్మలబస్తీలోని సమైక్య భారతి భవన్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఖైరతాబాద్ ఎస్సై నాగరాజు, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 115 మందికి సాధారణ, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు కిడ్నీ, డెంటల్, థైరాయిడ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సమైక్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, డాక్టర్లు శ్రీహరి, సుధాకర్, అబ్దుల్ రహమాన్, సిబ్బంది సాయిలేఖ, సౌజన్య, సునీత, భార్గవి, వైష్ణవి, సునీల్ కుమార్ సమైక్య భారతి ప్రతినిధులు అబ్దుల్ సత్తార్, మున్ని, అయబ్ ఖాన్, భరత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


నిందితుడిని పట్టించిన ఫోన్ పే



నిందితుడు పర్వాన్‌బేగ్

ఫిలింనగర్: 'గే' యాప్‌లో పరిచయం చేసుకుని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్న నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు ఫోన్ పే ద్వారా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. డబీర్‌పురాలో నివసించే పర్వాన్‌బేగ్ (25) జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం జెండర్ యాప్‌లో 'గే'లను పరిచయం చేసుకుంటూ వారిని తనవద్దకు రప్పించి వీడియోలు తీస్తూ బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నాడు. షేక్‌పేట జైహింద్‌నగర్‌కు చెందిన ఓ యువకుడి (22)ని గత నెల జెండర్ యాప్‌లో పరిచయం చేసుకుని తన వద్దకు రప్పించుకున్నాడు. ఇంటికి వెళ్లిన సదరు యువకుడితో సన్నిహితంగా మెలుగుతూ వీడియో రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించి రూ.15 వేలు డిమాండ్ చేశాడు. అయితే బాధితుడు రూ.10 వేలను ఫోన్ పే ద్వారా నిందితుడికి బదిలీ చేశాడు. తాను మోసపోయానని తెలుసుకుని ఈ నెల 1న ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితుడి ఫోన్ పే ఆధారంగా కాల్ డేటా సేకరించి ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పర్వానబేగ్ 'గే' కాదని, కేవలం 'గే'లను పరిచయం చేసుకుని బ్లాక్ మెయిల్ చేసేందుకు జెండర్ యాప్‌లో ఉన్నాడని, గతంలో కూడా ఇలాంటి బ్లాక్‌మెయిలింగ్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..ఓఆర్ఆర్ సమీపంలోని గాంధీనగర్ వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతిచెంది ఉందని 100 నంబర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని..స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డు పక్కన ఉండేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.